**50** చారిత్రక, పౌరాణిక కథలు

# రాజతంత్రం

(1984 సంక్రాంతి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందింది)

అవి హంపీ విజయనగర సామ్రాజ్యం వైభవంతో విలసిల్లుతున్న రోజులు.

శ్రీ కృష్ణదేవరాయలు ప్రజలను కన్నబిడ్డలలాగా చూసుకుంటూ వారికి ఏ విధమైన లోటూ లేకుండా పాలిస్తున్నాడు.

మహామంత్రి తిమ్మరుసు చలవ వల్లనే రాయలు రాజ్యాధికారాన్ని పొందగలిగాడు. అందువల్ల ఆయన పట్ల రాయలకి గురుభావం, పితృభావం రెండూ వుండేవి. అందుకే ఆయనను ఆప్యాయంగా 'అప్పాజీ' అని పిలిచేవాడు.

అవి - రాయలు రాజ్యానికి కొత్త వచ్చిన రోజులు కావడంతో ఇంచుమించు ప్రతి విషయానికీ తిమ్మరుసు మంత్రి పైనే ఆధారపడుతుండేవాడు రాయలు. ఆయన గీసిన గీటు దాటేవాడు కాదు. ప్రధాన నిర్ణయాలు అన్నీ ఆయనకే వదిలేసేవాడు. న్యాయ విచారణ అయితే జ్ఞాన వృద్ధుడయిన తిమ్మరుసు ఒక్కడే చేయాలి. ఆదర్శవంతమైన వారి పరిపాలనలో దేశం 'మూడు పువ్వులు- ఆరు కాయలు' గా విలసిల్లేది.

◦ ◦ ◦

అది సర్దార్ ఖాన్ ఇల్లు.

సామాన్యుడైన ఖాన్ కమ్మరి వృత్తి చేస్తూ జీవితం గడుపుకుంటుండేవాడు. అతడు స్వతహాగా మంచివాడు. కాని, ముక్కోపి. కోపంలో దుర్వాసుడిని మించినవాడు. కోపం వచ్చిందంటే తాను ఏమి చేస్తాడో అతడికే తెలీదు.

అది [illegible]వి కాలం.

పగలంతా వేడి గాడ్పులు వీస్తున్నా హంపీ విజయనగరం తుంగభద్రా నదికి దగ్గర వుండడం వల్ల రాత్రిళ్ళు కాస్తంత చల్లని గాలులు వీస్తున్నాయి. సర్దార్ ఖాన్ తన ఇంట్లో ముందు గదిలో



పడుకొని వున్నాడు. కాని, ఉక్కగా వుండడంతో సరిగా నిద్ర పట్టడం లేదు. అతడు నిద్ర పట్టక అటూ ఇటూ దొర్లుతున్నాడు.

ఇంతలో... అతడి ఇంటి అరుగు మీద నుండి ఎవరో 'ఖంగు ఖంగు' న దగ్గుతున్న శబ్దం వినిపించింది.

ఎవరో చూద్దామని తలుపు తీసి బయటకు వచ్చాడు ఖాన్.

ఆ అరుగుమీద ఎవరో నలుగురు పడుకుని వున్నారు. వారిలో ఒకడు బాధగా దగ్గుతున్నాడు.

వారిని చూస్తూ "ఎవరయ్యా మీరు?" అని అడిగాడు ఖాన్.

"అయ్యా! మేము పరదేశీయులం. నగరంలో పనుండి వచ్చాం. బాగా రాత్రి అవడంతో ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నాం. ప్రొద్దున్నే వెళ్లిపోతాం" అని వారిలో ఒకతను సమాధానం చెప్పాడు.

"సరే ..." అంటూ లోనికి వెళ్లిపోయాడు ఖాన్.

మళ్ళీ కొంచెంసేపయ్యేసరికి, "ఖంగ్... ఖంగ్" అంటూ మళ్ళీ చాలా ఎక్కువగా దగ్గు వినపడింది.

సర్దార్ ఖాన్ కోపంతో ధడాలున తలుపు తీసుకుని బయటకు వచ్చాడు.

"ఓయ్! ఇక్కడి నుండి మీరు వెంటనే వెళ్లిపోండి. ఈ దగ్గుతో నాకు తల అదిరిపోతోంది, నిద్ర పట్టడం లేదు" అన్నాడు కోపంగా.

"బాబ్బాబు- ఇంత రాత్రప్పుడు ఎక్కడికి పోతాం? కాస్తంత ఓపిక పట్టండి. అసలే మా రంగప్ప దగ్గుతో మెలికలు తిరిగిపోతున్నాడు" అంటూ బ్రతిమిలాడారు ఆ బాటసారులు.

"సరే ... దూరంగా పోయి దగ్గుకోమనండి. మళ్ళీ దగ్గు వినిపిస్తే వూరుకునేది లేదు" అంటూ లోపలికి పోయి దఢాలున తలుపులు వేసుకున్నాడు సర్దార్ ఖాన్.

ఖాన్ పెట్టిన భయం వల్లనే తగ్గిందో, లేక- నిజంగానే తగ్గిందోకాని, రంగప్ప దగ్గు కొంచెం తగ్గింది. ముసుగు బిగించుకొని నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు.

ఒక గంట గడిచింది.

బయట అరుగుమీద బాటసారులు ఆదమరిచి నిద్రపోతున్నారు. లోపల సర్దార్ ఖాన్‌కి మగత నిద్రపట్టింది.

ఇంతలో... ఉన్నట్లుండి ఏమయిందో, ఏమోకాని - రంగప్పకు దగ్గు తన్నుకు వచ్చింది. 'ఖంగ్, ఖంగ్"మంటూ ఊరూవాడా అదిరేటట్లు దగ్గసాగాడు.

ఆ దగ్గుకి అదరిపడి లేచాడు ఖాన్.

పట్టరాని కోపంతో ప్రక్కనే వున్న కైజార్ తీసుకుని ధడాలున వీధితలుపు తీసుకుని బయటకు వచ్చి, "బద్మాష్... పొమ్మన్నా పోకుండా నీ దగ్గుతో నా ప్రాణం తీస్తున్నావు, చావు!" అంటూ రంగప్పని బలంగా రెండు మూడుసార్లు పొడిచేశాడు.

అసలే దగ్గుతో మెలికలు తిరిగి పోతున్న రంగప్ప- కత్తిపోట్లతో గిలగిలలాడుతూ రక్తపు మడుగులో పడి ప్రాణాలు వదిలాడు.

హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనకు మిగిలిన బాటసారులు కొయ్యబారిపోయారు.

ఖాన్‌ని ఎదిరించే ధైర్యంలేక – అక్కడేవుంటే తమని ఏమి చేస్తాడోనన్న భయంతో వాళ్ళు పారిపోయారు.

తర్వాత తిన్నగా వెళ్లి తిమ్మరుసు మంత్రికి ఫిర్యాదు చేశారు.

తిమ్మరుసు ఆజ్ఞమేరకు రాజభటులు వెళ్లి సర్దార్ ఖాన్‌ని బందీ చేసి మర్నాడు రాజదర్బారులో ప్రవేశపెట్టారు.

శ్రీకృష్ణ దేవరాయల సమక్షంలో విచారణ ప్రారంభమయింది.

ప్రత్యక్ష సాక్షుల సాక్ష్యంతో పనిలేకుండా సర్దార్ ఖాన్ నేరం చేసినట్లు తనంతట తానే ఒప్పుకొనడంతో విచారణ త్వరగానే పూర్తయింది. తనకి రంగప్పతో వైరమేమీ లేదని, కేవలం అతడి దగ్గు భరించలేక క్షణికావేశంలో అతడిని చంపివేశానని తెలియజేశాడు ఖాన్.

ఖాన్ మాటలకి సభికులంతా నివ్వెరపోయారు.

కేవలం గట్టిగా దగ్గినందుకు దారుణంగా ఒక అమాయకుడిని చంపిన ఆ వ్యక్తికి మరణశిక్ష, అదికూడా... చిత్రవధతో విధించాలని అందరూ గట్టిగా అనుకున్నారు.

న్యాయ నిర్ణయం తీసుకోవలసింది తిమ్మరుసు కదా! ఆయన తీర్పు కోసం సభికులంతా నిశ్శబ్దంగా, ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

కృష్ణరాయలు కూడా ఉత్కంఠతో కూర్చున్నాడు.

"మహారాజా! ఈ వ్యక్తి క్షణికావేశంతో దారుణమైన హత్య చేశాడు. దానికి తగిన దండన పడవలసిందే. సకల రాజభోగాలతో ఇతడిని గౌరవించడమే సరియైన శిక్ష!" అని తీర్పు చెప్పాడు తిమ్మరుసు. చనిపోయిన వ్యక్తి బంధువులకు తగిన పరిహారం కూడా ఇవ్వాలని కూడా తన తీర్పులో పేర్కొన్నాడు ఆయన.

ఆ తీర్పు విని తమ చెవులు తామే నమ్మలేకపోయారు సభికులు.

ఖాన్ ఆశ్చర్యానికి అంతేలేదు.

కారణం లేకుండానే తిమ్మరుసు అటువంటి తీర్పు ఇయ్యడని కృష్ణదేవరాయలు మిన్నకున్నాడు.

కొంత కాలం గడిచింది.

సకల రాజ మర్యాదలతో, భోగాలతో హాయిగా జీవితం గడుపుతున్నాడు సర్దార్ ఖాన్. తనకి అంతటి వైభోగం కలిగించిన తిమ్మరుసు పట్ల, కృష్ణరాయల పట్ల అతడికి కృతజ్ఞత అణువణువునా నిండి పోయింది.

ఒకసారి. శ్రీకృష్ణ దేవరాయలు – తిమ్మరుసు, సర్దార్‌ఖాన్, కొద్దిమంది పరివారంతో వేటకి బయలు దేరాడు. అడవిలో విడిది చేశాడు.

ఈ సంగతి తెలిసి బహమనీ నవాబు అడవిలోవున్న కృష్ణదేవరాయలపై దాడికి వచ్చాడు. ఈ పరిస్థితులలో రాయలవారు చేయగలిగింది ఏమీ లేదు. వారి తరపున తిమ్మరుసు సంధి రాయభారం తెలుపుతూ ఒక లేఖను రాసి దానిని సర్దార్ ఖాన్ ద్వారా నవాబుకి పంపించాడు.

కృష్ణదేవరాయలంతటి వాడు సంధి కోరేసరికి– పట్టపగ్గాలు లేకపోయాయి నవాబుకి. ఆ లేఖ విప్పి చదవసాగాడు.

ఆ లేఖ నిండా నవాబును తిడ్తూ ఘాటైన పదజాలం వుంది. అది చదవగానే కోపం పట్టలేక రాయలవారిని తిడ్తూ లేఖని నేలకేసి కొట్టి దాని మీద ఉమ్మి వేశాడు నవాబ్.

తనకి దైవ సమానుడైన రాయల వారు పంపిన లేఖను అవమానపరచి, ఆయనను తిట్టేసరికి– కోపం పట్టలేక పోయాడు సర్దార్‌ఖాన్.

వెంటనే బొడ్డులోంచి ఖైజార్ తీసి నవాబు మీదికి ఉరికి పొడిచి చంపేశాడు.

ఆకస్మికంగా ఈ సంఘటన జరగడంతో ఎవ్వరూ నవాబును కాపాడలేక పోయారు. అయితే... ఆ వెంటనే నవాబు పరివారం ఖాన్ తల నరికి వేసింది.

నవాబు చనిపోవడంతో అతడి పరివారం తమ రాజ్యానికి పారిపోయారు.

ఆ విధంగా రాయలవారి సామ్రాజ్యానికి పట్టబోయిన మహావిపత్తు తప్పిపోయింది. అప్పుడు అర్థం అయింది రాయలవారికి – తిమ్మరసు రాజతంత్రం!

"అవును ప్రభూ! క్షణికావేశంలో ప్రాణాలకు తెగించి ముందుకు ఉరికేవాళ్ళు కూడా అవసరమే! ఖాన్‌లో ఈ లక్షణం గమనించి, ఎప్పటికైనా మనకి పనికి వస్తాడనే అతడికి రాజభోగాలు కల్పించాను. ఈ కృతజ్ఞతతో అతడు తన ప్రాణాలొడ్డి మన సామ్రాజ్యాన్ని కాపాడాడు" అని విశదపరిచాడు తిమ్మరుసు.

తిమ్మరసు రాజతంత్రానికి అందరూ ఆశ్చర్యపోయారు.

★★★